క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభం

నర్సంపేట : స్థానిక డిపో నుంచి పలు రూట్లలో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.నర్సంపేట నుంచి హన్మకొండకు ఉదయం 5.45 నుంచి రాత్రి 7 గంటల వరకు 1.15 గంటలకొకటి చొప్పున డీలక్స్ బస్సులు నడుస్తాయని తెలిపారు. అలాగే ఉదయం 6.45, సాయంత్రం 4 గంటలకు ఎల్లాయిగూడెం, గుండెంగ, నాగారం నుంచి కేసముద్రం వరకు, ఉదయం 7.30, 12.15, సాయంత్రం 4.15కి నర్సంపేట నుంచి ఇనుగుర్తి, నెల్లికుదురు మీదుగా తొర్రూరుకు, ఉదయం 7.15, సాయంత్రం 5.15కు అశోక్‌నగర్, దబ్బీర్‌పేట గ్రామాలకు పల్లె వెలుగు సర్వీసులు నడుస్తాయని చెప్పారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుధాకర్



రాయపర్తి : తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ముద్రబోయిన సుధాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల ఉన్నతికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మహాసభ బలోపేతానికి పాటు పడతానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్రబోయిన వెంకన్న, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ చెవ్వ కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల అందజేత



గీసుకొండ : మండల కేంద్రంలోని గ్రామైఖ్య సంఘాల సభ్యుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రడం భరత్ సొంత డబ్బుతో సమకూర్చిన స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ క్లస్టర్ కోఆర్డినేటర్ పొగాకు సుజాత, సామాజిక సేవకులు కర్ణకంటి రామ్మూర్తి, రేవంత్ రాథోడ్, మాజీ ఎంపీటీసీలు వీరారావు, భిక్షపతి, మాజీ సర్పంచ్‌లు గాజర్ల గోపి, బోనాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్..



రాయపర్తి : మండలంలోని మైలారంలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు స్థానిక యువకుడు చిర్ర వేణు తన సొంత డబ్బుతో కొనుగోలు చేసిన నోట్ బుక్స్ శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు తోడ్పాటు అందించే ఉద్దేశ్యంతో రూ.6 వేల విలువైన బుక్స్ కొనుగోలు చేసి అందించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అజ్మీరా ఉమాదేవి, సింగారపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు డోలి రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళా రక్షణ చట్టాల వివరాలతో కూడిన కరపత్రాలను తహసీల్దార్ రమేశ్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం 'బేటీ బచావో.. బేటీ పడావో' పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. బాలికలు చదువులో రాణించాలని సూచించారు. మహిళల, బాలికల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ఆపదలో హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పావని, పంచాయతీ కార్యదర్శి సుప్రజ, సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, ఏఎస్ఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని క్యాతాలకు చెందిన గీత కార్మికుడు, బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు చెంగల సురేశ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టు నుంచి పడి మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, తిరుపతిరెడ్డి, కుమారస్వామి, కిషన్‌రావు శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు.

కేజీబీవీల్లో అదనపు పౌష్టికాహారం

● డైట్ ఛార్జీల పెంపుతో మెనూలో మార్పులు

నల్లబెల్లి : జిల్లాలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అదనపు పౌష్టికాహారం అందుతోంది. పేద విద్యార్థినులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధనతోపాటు నాణ్యమైన ఆహారం అందించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే నూతన విద్యాసంవత్సర ప్రారంభం నుంచి విద్యార్థినుల డైట్ ఛార్జీలు పెంచింది. దీంతో విద్యాలయం తెరుచుకున్న నాటి నుంచి విద్యార్థినులకు అదనపు పౌష్టికాహారం అందుతోంది.

మెనూ అమలు ఇలా..

జిల్లావ్యాప్తంగా 10 కేజీబీవీలున్నాయి. ప్రభుత్వం ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి కామన్ మెనూ అమలు చేస్తోంది. గతంలో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం నెలకు మెస్ ఛార్జీల కింద రూ.1225 చెల్లిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ.1740 చొప్పున చెల్లించేందుకు నిర్ణయించి అమలు చేపట్టింది. ఒక్కో విద్యార్థిపై రూ.515 అదనంగా పెరగడంతో నెలకు రెండు సార్లు మాంసం, 5 సార్లు చికెన్, వారంలో 5 సార్లు గుడ్లు, శాఖాహారులైతే మీల్ మేకర్ అందిస్తున్నారు. రోజూ ఉదయం అల్పాహారంలో టమాటా బాత్, కిచిడీ, రాగి జావ, ఇడ్లీ-సాంబర్, ఉప్మా, బూస్ట్, పూరీ, పులిహోర, జీరా రైస్, బోండా, వడ, చపాతీ, అరటి పండు అందిస్తుండగా మధ్యాహ్నం భోజనంతోపాటు టమాట పప్పు, ఆకుకూర, ఇతర కూరగాయలతో నెయ్యి, రసం, పెరుగు అందిస్తున్నారు. సాయంత్రం ఉడికించిన పెసర్లు, శనగలు, బఠాణీలు, బొబ్బెర్లు, ఎగ్ బజ్జీ, పల్లీపట్టీ, అల్లం చాయ్, నువ్వుల లడ్డు, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి ఇస్తున్నారు. ఇక రాత్రి వేళ భోజనంలో ఆకుకూర, సాంబర్, మజ్జిగ ఆహార పట్టికలో పొందుపర్చారు.



కేజీబీవీ భవనం

అమలులో తల్లిదండ్రుల భాగస్వామ్యం



నూతన మెనూ అమలులో తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తాం. విద్యార్థినులకు చదువుతోపాటు పౌష్టికాహారం అందించడంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. డైట్ మెనూ చార్ట్‌ను విద్యాలయ ఆవరణలోని గోడలపై ప్రదర్శిస్తాం. ఆకస్మిక తనిఖీలు ఉంటాయి. అమలులో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తాం.

\- కె.ఫ్లోరెన్స్, బాలికా అభివృద్ధి అధికారి

డ్రగ్స్ నిర్మూలనలో యువత కీలకం



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఏసీపీ నర్సయ్య



దుగ్గొండి : మాట్లాడుతున్న ఎస్సై రణధీర్‌రెడ్డి

● ఏసీపీ అంబటి నర్సయ్య

వర్ధన్నపేట : సమాజంలో డ్రగ్స్ నిర్మూలనలో యువత కీలకమని స్థానిక ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించనున్న క్రమంలో పట్టణంలని జెడ్పీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కొందరు డ్రగ్స్ బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికను, ప్రవర్తనను గమనిసూ ఉండాలని సూచించారు. గంజాయి, హెరాయిన్, నార్కోటిక్స్, తదితరాల వల్ల కలిగే నష్టాలపై యువతను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై చందర్, హెచ్ఎం రంగా అనిల్, ఎన్‌సీసీ ఆఫీసర్ మనుజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుమారస్వామి, దేవయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

దుగ్గొండి : అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి చెప్పారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైసూక్క్‌ల్‌లో శనివారం ఏర్పాటు చేసిన శనివారం ఆయన అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్లు అమాయకులను ఆకర్షించేలా మెసేజ్‌లు పంపుతూ వల వేస్తారని చెప్పారు. అనుమానాస్పద, తెలియని లింక్‌లను తెరిస్తే బ్యాంకు ఖాతాలోని డబ్బు మాయం అయ్యే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎలగొండ రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పర్వతగిరి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

విద్యార్థుల ర్యాలీ

పర్వతగిరి : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్/కళాశాల విద్యార్థులు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై చైతన్యవంతం చేసేలా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడారు. సమాజం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆకాంక్షించారు. గుడుంబా, గంజాయి, గుట్కా లాంటి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలు చైతన్యవంతం కావాలని కోరారు.

బీజేపీ పాలన ప్రపంచానికే ఆదర్శం

● జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పాలన ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు గూడూరు సందీప్, తనుగుల అంబేడ్కర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన «వికసిత్ భారత్» మండల సంకల్ప సభకు రాణాప్రతాప్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రపంచ స్థాయిలో భారత కీర్తి ఇనుమడింపజేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. పథకాలు అర్హులకు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. తద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా కోకన్వీనర్ కూనమల్ల పృథ్వీరాజ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిల్ల రాంచందర్, నాయకులు మల్యాల వినయ్, కుంభం కోమల్‌రెడ్డి, శీలం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

రైతులు నమోదు చేసుకోవాలి

పర్వతగిరి : రైతులు భూమికి సంబంధించి విశిష్ట సంఖ్య కోసం ఫామ్ రిజిస్ట్రీలో ఈనెల 27 వరకు పేరు నమోదు చేయించుకోవాలని ఏఓ ప్రశాంత్ ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు వర్తించాలంటే విశిష్ట సంఖ్య ఉండాలని పేర్కొన్నారు. పట్టా పాస్ బుక్‌తో పాటు ఆధార్ నంబర్, ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్ అధికారులకు అందించాలని తెలిపారు. నమోదులో భాగంగా మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఏఈఓకు ఇస్తేనే ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నర్సంపేట రూరల్: ప్రొసీడింగ్స్ ఇస్తున్న పార్వతమ్మ



పర్వతగిరి : నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

● మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ

నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ తెలిపారు. నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లిలో లబ్ధిదారులకు శనివారం ఆమె ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే పలువురి ఇళ్ల నిర్మాణాకు ముగ్గుపోసి ప్రారంభించి మాట్లాడారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బందారుపల్లి దేశింగరావు, పంచాయతీ కార్యదర్శి అజయ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వేజెండ్ల శరత్, కోసూరి శ్రీను, తిరుపతమ్మ, చుండు అనంతమ్మ, పెండ్యాల సీతమ్మ, నర్సింహారావు, మందలపు వెంకటేశ్వర్లు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ శంకర్ నాయక్ పరిశీలించారు. లబ్ధిదారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేయొద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ శేషు, కార్యదర్శి రఘు, కారోబార్ మేడిశెట్టి కరుణాకర్, బాసాని స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

● సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

నర్సంపేట : దోపిడీ లేని సమాజ స్థాపనే లక్ష్యంగా సీపీఐ పోరాటాలు నిర్మిస్తోందని జిల్లా కార్యదర్శి మేకల రవి తెలిపారు. పట్టణంలోని మాధన్నపేట రోడ్డు సీపీఐ కాలనీలో పాలక కవిత, పిట్టల సతీశ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన శాఖ 4వ మహాసభకు రవి అతిథిగా హాజరై మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే దిశగా అనేక ప్రజలపై భారాలు మోపుతున్నాయని తెలిపారు. సంపన్నులకు సబ్సిడీలు ఇస్తూ పేదలపై పన్నులు వేస్తున్నారని చెప్పారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచిన విషయాన్ని ఉటంకించారు. నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఏటా రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని తుంగలో తొక్కారని వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్మిస్తామని చెప్పారు. సభలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శులు భాషా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, లక్కపెల్లి రమేశ్, గుంపెల్లి మునీశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రవి

రాజకీయాలకు అతీతంగా సేవలు

● 'ఎస్ఆర్ఆర్' చైర్మన్, నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవలు అందిస్తున్నట్లు చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెర్కవేడులో యువతకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం మూడు క్రికెట్ కిట్లు అందించారు. అనంతరం మైలారం, చక్రుతండా, రాయపర్తి, వెంకటేశ్వరపల్లి, కొండూరు, తెట్టె కుంటతండా, జేతురాంతండా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులతోపాటు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఫౌండేషన్ రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా పేదలకు సేవలు అందిస్తుందని చెప్పారు. పేదలు ఫౌండేషన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, నాయకులు సంతోశ్, మధూకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



యువకులతో శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులను గెలిపించాలి

● మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి

దుగ్గొండి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ముదిరాజ్ కులానికి చెందిన అభ్యర్థులను రాజకీయ పార్టీలకు అతీతంగా గెలిపించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి కోరారు. మండలంలోని గిర్నిబావిలో ఈనెల 27న జిల్లాస్థాయి సభ నిర్వహించనున్న క్రమంలో శనివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ రాజకీయంగా వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ముదిరాజ్ మహాసభ కమిటీలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 27న తలపెట్టిన మహాసభకు కులస్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా ముద్రబోయిన సుధాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మొగిలి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. పట్టణాల్లో, గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లోనే కాకుండా క్రీడా మైదానాల్లో, ప్రధాన కూడళ్లలో యోగాపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు యోగా సాధన చేయించి అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత పాల్గొని యోగా సాధన చేశారు.



నర్సంపేట : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు



నర్సంపేట : యోగా చేస్తున్న బీజేపీ నాయకులు



నర్సంపేట : జెడ్పీ హైస్కూల్‌లో..



దుగ్గొండి : మల్లంపల్లి హైస్కూల్‌లో..



ఖానాపురం : సైనిక్ స్కూల్‌లో..



రాయపర్తిలో..



సంగెం : జెడ్పీ హైస్కూల్‌లో..



పర్వతగిరి : ఏనుగల్లులో..



వర్ధన్నపేట : యోగా చేస్తున్న విద్యార్థులు



నెక్కొండలో..

రైతుభరోసా విడుదల

గీసుకొండ : మండలంలో రైతుభరోసా కింద నాటికి 12365 మంది రైతులకు రూ.10.95 కోట్లు విడుదలైనట్లు ఏఓ హరిప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నాటికి 12758 మంది రైతుల బ్యాంకు ఖాఖాతాలో రూ.12.48 కోట్ల రైతుభరోసా నిధులు జమ చేసేలా ట్రెజరీకి వివరాలు పంపించగా ఇప్పటివరకు 88 శాతం మందికి 85 శాతం నిధులు అందాయని వివరించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలికి చెందిన మంద బాబు (56) అనారోగ్య సమస్య తాళలేక శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలో కర్రకు ఉరేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళి



నర్సంపేట : పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట/దుగ్గొండి/ఖానాపురం/నల్లబెల్లి : నర్సంపేట, దుగ్గొండి, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య జయశంకర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నర్సంపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నల్లబెల్లి మండల అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోనే ప్రమాదం.. ప్రభుత్వం ఆదుకోవాలి

పర్వతగిరి : తన భర్త విధి నిర్వహణలో ఉండగా విద్యుదాఘాతానికి గురి కావడంతో తాము వీధిన పడ్డామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ అన్‌మెన్ కార్మికుడు బాలు సతీమణి లలిత కోరింది. శనివారం ఆమె మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకుంది. ఎల్‌సీ తీసుకోకుండానే తన భర్తను ఏఎల్ఎం నిశాంత్ వర్మ ట్రాన్స్‌ఫార్మర్ మీదకు ఎక్కించగా ప్రమాదం చోటు చేసుకుని తన భర్తకు రెండు కాళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. బాలుకు శనివారం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో వైద్యులు రెండు కాళ్లు తొలగించారని వాపోయింది. తన భర్త చావుబతుకుల్లో ఉన్నాడని కన్నీరు మున్నీరైంది. తన భర్త దుస్థితికి ఏఎల్ఎం నిశాంత్ వర్మ అనాలోచిన విధానాలే కారణమని ఆరోపించింది. తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పింది. బాలు రెండు కాళ్లు తొలగించడంతో ప్రాణాలు దక్కినా జీవితాంతం పని చేయలేని దుస్థితి నెలకొందని చెప్పారు. తన కుటుంబాన్ని ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఆదుకోవాలని వేడుకుంది.